క్లుప్తంగా

స్వచ్ఛ భారత్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో అధికారులు

కందుకూరు: మండల పరిషత్ సమావేశ హాల్‌లో బుధవారం ఎంపీడీఓ వెంకట్రాములు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు స్వచ్ఛభారత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తడి,పొడి చెత్త, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకన్న అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతిపాండు, జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కావెంజర్లకు వేతనాల పంపిణీ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు పారిశుద్ధ్య కార్మికుల(స్కావెంజర్లు)కు రూ.5వేలను వేతనంగా మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్ బుధవారం అందజేశారు. పాఠశాల పరిశుభ్రత కోసం తనవంతుగా ఆర్థిక సహాయం అందజేశారనన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దేవేందర్ మహరాజ్

మహేశ్వరం: దళిత శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న స్వరాజ్య పాదయాత్ర ముగింపు మహాసభ వాల్ పోస్టర్‌ను బుధవారం మహేశ్వరం మండల కేంద్రంలో డీఎస్‌పీ అధ్యక్షుడు దేవేందర్ మహరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభకు మహేశ్వరం నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ప్రజాస్వామ్య వాదులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జంగయ్య మహరాజ్, మండల కార్యవర్గ సభ్యులు పరమేశ్ మహరాజ్, హనూక్ మహరాజ్, శ్రీధర్ మహరాజ్, భరత్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి రూ.50 వేల విరాళం



చెక్కు అందజేస్తున్న ఎస్ఎస్ఆర్ రెసిడెన్సీ ప్రతినిధులు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ డివిజన్ పోచమ్మబాగ్‌కు చెందిన ఎస్ఎస్ఆర్ రెసిడెన్సీ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి రూ.50 వేల విరాళం అందజేశారు. విద్యార్థులకు నెల రోజులకు సరిపడే బియ్యం, ఇతర నిత్యావసరాల కొనుగోలు కోసం ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో గృహం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, అనాథ విద్యార్థి గృహం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనాథ, నిరుపేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించి వారి భవిష్యత్‌కు కృషి చేస్తున్నదని కొనియాడారు. కార్యక్రమంలో రెసిడెన్సీ ప్రముఖులు వి.జితేంద్ర, నాగార్జున రెడ్డి, డాక్టర్ ఎస్పీ రంగనాయకులు పాల్గొన్నారు. ఆర్థిక సాయం చేసిన ఎస్ఎస్ఆర్ రెసిడెన్సీ ప్రతినిధులకు గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి



గౌతమీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ గౌతమీనగర్ కాలనీలో నెలకొన్న వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హామీ ఇచ్చారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన సర్కిల్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి రహదారులపై నిలిచిన వరదనీటిని పరిశీలించారు. వెంటనే స్పందించిన లచ్చిరెడ్డి సంబంధిత సిబ్బందిని కాలనీకి రప్పించి వరదనీటి సమస్యను తాత్కాలికంగా పరిష్కరింపజేశారు. కాలనీలో త్వరలో నాలా పూడికతీత పనులు ప్రారంభించటంతో పాటు అవసరమైన చోట నాలా విస్తరణ పనులు కూడా చేపడతామన్నారు. కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రమణమూర్తి, శ్రీకాంత్, సుధాకర్, రాంగోపాల్, సర్కిల్ అధికారులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించండి

- పదో రోజుకు చేరిన వీఓఏల నిరసన
- కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్



మహేశ్వరం: రోడ్లు ఊడ్చి నిరసన తెలుపుతున్న వీఓఏలు, సీఐటీయూ నాయకులు

మహేశ్వరం: వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఏర్పుల శేఖర్ డిమాండ్ చేశారు. మహేశ్వర మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరసన దీక్ష బుధవారంతో 10వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా వీఓఏలు రోడ్లు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో పాల్గొన్న శేఖర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి 9 ఏళ్లు గడిచినా వీఓఏల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. వీఓఏలు.. గ్రామ స్థాయిలో మహిళల అభ్యున్నతి, మహిళా సాధికారత వంటి పథకాలకు సంబంధించి పనులు చేస్తున్నారని అన్నారు. ప్రతినెలా రుణాల వడ్డీలు వసూలు చేసి సెర్ప్ సంస్థను లాభాల్లో ఉంచుతున్నారని, ఇలా ఎన్నోరకాల పనులు చేస్తున్న వీఓఏలను కనీసం సెర్ప్ ఉద్యోగులుగా కూడా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26వేలు, రూ.10 లక్షల వరకు సాధారణ బీమా ఇవ్వాలన్నారు. పది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని.. వెంటనే వీఓఏలను పిలిపించి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం మహేశ్వర మండల కమిటీ సభ్యులు శివలీల, సంగీత, సంతోష, యాదయ్య, రాజకుమార్, కవిత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. సమ్మెలో భాగంగా వీఓఏలు చీపుర్లతో పరిసరాలను శుభ్రం చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ బాలరాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలకు నెలకు రూ.2 లక్షల వేతనం చెల్లిస్తున్నారని.. వీఓఏలకు మాత్రం కేవలం రూ.3900 వేతనంగా ఇస్తున్నారని.. వీటితో ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. మంత్రి సబితారెడ్డి స్పందించి వీఓఏల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు స్వప్న, సబిత, లావణ్య, పావని, కవిత, రాధ, గీత, జయ, ఝాన్సీ, బాలమణి, శశికళ, రాంచంద్రారెడ్డి, సురేష్, గీత, రజని పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదలకు మేలు



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కందుకూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని బేగరికంచెలో ఎంపీపీ మంద జ్యోతి పాండు, సర్పంచ్ ఢిల్లీ సరళమ్మతో కలిసి ఆయన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు కళ్ళద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ్ల సమస్యలతో బాధపడుతున్న వారితో పాటు శస్త్ర చికిత్సలు అవసరమున్న వారికి ప్రభుత్వమే ఉచితంగా చేయిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ జి.శమంత, ఎంటీసీ కాకి రాములు, ఉప సర్పంచ్ రూప్లానాయక్, బీఆర్ఎస్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిత్ర సాయిలు, పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న సర్కార్

వైఎస్సార్‌టీపీ యువనేత సుమన్‌గౌడ్

పహాడీషరీఫ్: ఇందిరా పార్కు వద్ద వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన టీసేవ్ దీక్షకు బుధవారం ఆ పార్టీ యూత్ వింగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుర్జని సుమన్‌గౌడ్ మహేశ్వరం నియోజకవర్గం నుంచి కార్యకర్తలతో తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హామీలను తుంగలో తొక్కారన్నారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఏళ్ల తరబడిగా ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. నియామకాల కోసం పోరాడుతున్న వైఎస్.షర్మిలపై కక్ష్య సాధింపు చర్యలకు దిగుతున్నారన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటన వెనుక అసలు సూత్రధారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నందిహిల్స్‌లో సమస్యలు పరిష్కరించండి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మంత్రి సబితారెడ్డికి కాలనీవాసుల వినతి

మీర్‌పేట: కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మీర్‌పేట కార్పొరేషన్ పరిధి నందిహిల్స్ సెంట్రల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఛిద్రమైన రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. కాలనీలోని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మిడిదొడ్డి రవికుమార్‌గుప్తా, మల్లేపల్లి కోటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఇటీవల జరిగిన మినీ ప్లీనరీలో ప్రవేశపెట్టిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించడంతో బుధవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్లెప్రగతి కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి గ్రామాల్లో చర్చించాలని సూచించారు. మినీ ప్లీనరీలో సీఎం కేసీఆర్‌కు ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యేకు కడ్తాల్ గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఈ సందర్భంగా జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

ఆమనగల్లు: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కడారి మల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కడారి మల్లయ్యకు బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా ద్వారా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మల్లయ్య భార్య లక్ష్మీదేవికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఇర్విన్ సర్పంచ్ పుష్పలత, జంగయ్య, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీఏవైఎల్ టికెట్లపై డిస్కౌంట్

హయత్‌నగర్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ జగన్

ఇబ్రహీంపట్నం: కండక్టర్లు.. ప్రయాణికుల పట్ల మర్యాదగా మసులుకోవాలని హయత్‌నగర్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ జగన్ అన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో బుధవారం కండక్టర్లకు టీఎస్‌సీటీ చాలెంజ్ ట్రైనింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ ఆదాయాన్ని పెంచుకోవాలంటే అధిక సంఖ్యలో ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు కండక్టర్ల కృషి ఎంతో ముఖ్యమన్నారు. ప్రయాణికులతోనే ఆర్టీసీ మనుగడ సాగిస్తుందన్నారు. గురువారం నుంచి టీఏవైఎల్(ట్రావెల్ యాజ్ యు లైక్) రూ.100 టికెట్లపై 10శాతం డిస్కౌంట్, 60 సంవత్సరాలు పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు టీఏవైఎల్ టికెట్ రూ.100పై 20 శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీని ఆదరించాలన్నారు.

కనులపండువగా అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలో అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, శ్రీ పుష్పయాగం, సప్తావరణం, ద్వాదశారాధన కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి ఆలయం నుంచి ఆర్‌కేపురం వరకు పెద్ద రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, కమిటీ సభ్యులు గంప జగన్, ఐతే అంజయ్య గుప్తా, గౌరిశెట్టి అరుణ్, బాలగోపాల్, చిలుక ఉపేందర్‌రెడ్డి, బొగ్గరపు రవీందర్, దాచేపల్లి శ్రీనివాస్, తమ్మన శ్రీధర్, శ్రీకాంత్ గాండే, ఉమాపతి పాల్గొన్నారు..

ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చండి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

కడ్తాల్: ముదిరాజుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి చేర్చాలని.. 52 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పింఛన్ మంజూరు చేయాలని, ముదిరాజ్ కులగణన చేపట్టాలని కోరారు. అనంతరం కల్వకుర్తి ముదిరాజ్ మహాసభకు వారు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు యాట నర్సింహ, రాఘవేందర్, రంగయ్య, శేఖర్, యాదయ్య, రాంచంద్రయ్య, జంగయ్య, రమేష్, లక్ష్మయ్య, శ్రీను, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

గొల్లకురుమల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న దశరథ్‌నాయక్

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: గొల్లకురుమల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో శ్రీమల్లికార్జున గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఆధ్వర్యంలో గొర్రెల పెంపకందారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. గొల్లకురుమల సంక్షేమాన్ని గుర్తించిన ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని.. కురుమ, యాదవ సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై రెండో విడుత గొర్రెలను పంపిణీ చేస్తుందన్నారు. సబ్సిడీ గొర్రెలతో ఆర్థికంగా ఎదగాలన్నారు. సర్పంచ్ భారతమ్మ విఠలయ్యగౌడ్, ఎంపీటీసీ గోపాల్, ఉప సర్పంచ్ వెంకటేశ్, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణ, పశువైద్యుడు భానునాయక్, గొల్లకురుమ సంఘం అధ్యక్షుడు బీరప్ప పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో బుధవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి యాదవసంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో మంగళపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద యాదవసంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికిక్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ అనంత రెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి, యాదవసంఘం అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, పశువైద్యాధికారి విజయ్‌కుమార్, నాయకులు వెంకటేశ్ పాల్గొన్నారు.

తెలంగాణలో రాక్షస పాలన

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



జోడో యాత్రలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: తెలంగాణలో రాక్షస పాలన సాగుతుందని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండలంలోని ఆస్మత్‌పూర్, చాంద్‌ఖాన్ గూడ గ్రామాల్లో నిర్వహించిన హాత్‌సే హాత్ జోడో యాత్రలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కార్ రాక్షస పాలనను అంతం చేసే దిశగా ఉద్యమాలు చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకోసం అందరూ కలిసి రావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ, రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు, రూ.500కే వంటగ్యాస్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు బోళ్ల జగన్, చేతాళ్ల సంజీవ, బుగ్గరాములు, మంఖాల దాస్, మండల కోఆప్షన్ సభ్యుడు వాజిద్, పీఏసీఎస్ డైరెక్టర్లు హన్మంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘కురుమ’ భవన నిర్మాణానికి నిధులు



కురుమ సంఘం నాయకులకు నిధుల ప్రొసీడింగ్ అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న కురుమ సంఘం భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కురుమ సంఘం నాయకులతో ఆయన సమావేశమయ్యారు. కురుమ సంఘ భవన నిర్మాణం నిధులు లేక అసంపూర్తిగా ఉందని.. భవన నిర్మాణం పూర్తిచేసేందుకు సహకరించాలని కురుమ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సంఘ భవన నిర్మాణ పనులకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.2లక్షల ప్రొసీడింగ్‌ను సంఘం నాయకులకు ఆయన అందజేశారు. అనంతరం కురుమ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఉప సర్పంచ్ రామకృష్ణ, గొర్రెల పెంపకం దారుల సంఘం అధ్యక్షుడు క్యామ చంద్రశేఖర్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు యాదయ్య, రమేశ్, నాగార్జున, రాము లు, వెంకటయ్య, మల్లేశ్, మహేశ్, శివ, రమేశ్, రాజేశ్ ఉన్నారు.

ఆట స్థలాలు ఏవి?

- మంచాల మండలంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో జాప్యం
- ప్రభుత్వ స్థలాలు లేకపోవడమే కారణమంటున్న అధికారులు



జాపాలలోని తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం

మంచాల: గ్రామీణ ప్రాంత యువకులను క్రీడల్లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పల్లెల్లో ‘తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణము’లను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. అందుకోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద ప్రత్యేకంగా అవసరమైన నిధులను కూడా సమకూరుస్తుంది. గొప్ప లక్ష్యంతో ప్రారంభించిన ఈ పథకం గ్రామాల్లో స్థలాలు లేకపోవడంతో సక్రమంగా అమలు కావడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో ఇప్పటి వరకు 12 గ్రామ పంచాయతీల్లో మాత్రమే తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మరో 11 గ్రామాల్లో స్థలాలు లేక ఏర్పాటు చేయలేదు. ప్రతి గ్రామంలో తప్పక క్రీడా ప్రాంగణము ఉండాలనేది ప్రభుత్వ ఆదేశం. గ్రామంలో ప్రజలకు అనువైన చోట ఎకరా నుంచి అర ఎకరా పొలంలో క్రీడాస్థలం గుర్తించి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి. అందుకు అవసరమైన నిధులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మంజూరు చేస్తారు.

ఆ గ్రామాల్లో స్థలాల కొరత..

మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో స్థలం లేదనే కరాణంతో ప్రభుత్వం తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయలేదు. అందులో లోయపల్లి, రంగాపూర్, ఆంబోత్ తండా, కొర్రం తండా, సత్తి తండా, బోడకొండ, ఎల్లమ్మ తండా, చీదేడ్, తదితర గ్రామాల్లో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేదని ఏర్పాటు చేయలేదని అధికారులు తెలిపారు. ఆస్మత్‌పూర్, కాగజ్‌ఘాట్ గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు స్థలం ఉన్నప్పటికీ.. స్థలం వివాదాల కారణంగా అక్కడ ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా గ్రామాల్లోని యువత క్రీడలకు దూరమవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

“గ్రామాలకు సమీపంలో ఉండాలి



ప్రభుత్వం పల్లె ప్రగతి పేరుతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తోంది. అందులో భాగంగానే గ్రామాల్లో ప్రభుత్వ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తోంది. క్రీడా మైదానాలు గ్రామాలకు సమీపంలో ఉండటంతో పాటు అక్కడ అన్ని వసతులు ఉండాలి. యువత ప్రతిరోజు క్రీడలకు సమయం కేటాస్తే ఫిట్‌గా ఉంటారు.

– శేఖర్, ఆరుట్ల

రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండల పరిధిలోని 11 గ్రామాల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయలేదు. ఆయా గ్రామాల్లో స్థలం లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు స్థలం చూపించిన వెంటనే ఏర్పాటు చేస్తాం.

– తేజ్‌సింగ్, ఎంపీఓ, మంచాల